

కులగణన నివేదికపై నిర్ణయం వాయిదా

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కులగణన నివేదికపై కేబినెట్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేసింది. శుక్రవారం సీఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఇందులోని కీలక నిర్ణయాలను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. 2015లో చేపట్టిన సర్వేకు సంబంధించిన నివేదికపై సమగ్ర చర్చ జరిపే అంశం వాయిదా వేసినట్టు తెలిపారు. కాగా బెంగళూరులోని ప్రముఖ బెళ్ళందూరు చెరువు అభివృద్ధికి కట్టుబడ్డామని, జాతీయ హరిత న్యాయస్థానం మార్గదర్శకాల ప్రకారం చెరువును సమగ్రంగా అభివృద్ధి చేయదలిచినట్టు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా..

తిరంగా యాత్ర

● కదిలివచ్చిన నగర ప్రజలు ● త్రివర్ణ పతాకాన్ని చేతపట్టి నినాదాలు



తిరంగాయాత్రను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం, మంత్రులు

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతసైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా తిరంగా యాత్ర జరిపారు. శుక్రవారం ఉదయం కేఆర్ సర్కిల్‌లో తిరంగాయాత్రను సీఎం సిద్దరామయ్య ప్రారంభించారు. విద్యార్థులు, ఉద్యోగులతోపాటు నగర ప్రజలు యాత్రలో భాగస్వాములయ్యారు. ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ యాత్రలో పాల్గొన్నారు. విధానసౌధ, హైకోర్టు నుంచి చిన్నస్వామి స్టేడియం సమీపంలోని ఎంజీ రోడ్డు గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఇండియన్ ఆర్మీకి మద్దతు ఇస్తున్నట్టు ప్రజలు నినాదాలు చేశారు. తిరంగాయాత్రలో అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారు. వందేమాతరం, భారత్‌మాతాకీ జై, ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో తిరంగా యాత్ర జరిగింది. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు హెచ్‌కే పాటిల్, పరమేశ్వర్, బోసరాజు, ఎంసీ సుధాకర్, మహదేవప్ప, ప్రియాంక ఖర్గే, దినేశ్ గుండూరావు తదితరులు పాల్గొన్నారు. ఒకానొక దశలో పోలీసులు వీఐపీలకు భద్రత మధ్యన వెళ్లేలా వెసలుబాటు కల్పించే ప్రయత్నం చేశారు. అందుకు డీసీఎం నిరాకరించారు. అందరితో సమానంగా తిరంగాయాత్ర ఉండాలని సూచించారు. తిరంగాయాత్రతో నగరానికి కళ వచ్చినట్టయ్యింది.





విధానసౌధ వద్ద తిరంగాయాత్ర సందడి



విద్యార్థులు సైతం ఉత్సాహంగా..



పద్మశ్రీ గ్రహీత జోగతి మంజమ్మను సత్కరిస్తున్న డీసీఎం, నిర్మలానందనాథ స్వామీజీ

మార్పు కోసమే మౌలిక సదుపాయాల పెంపు

-డీసీఎం డీకే శివకుమార్

7

పాకిస్థాన్ పౌరులను పంపించేయాలి

● సుహాస్‌శెట్టి హత్యకేసు ఎన్‌ఐఏకు అప్పగించాలి

● గవర్నర్‌కు బీజేపీ నాయకుల వినతి

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నివసిస్తున్న పాకిస్థాన్ ప్రజలను వెంటనే వారి దేశానికి పంపేలా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని గవర్నర్‌కు బీజేపీ నేతలు విన్నవించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నేతృత్వంలో శుక్రవారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్‌కు వినతిపత్రాన్ని అందించారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట తిప్పికొడుతోందని వివరించారు. కేంద్రప్రభుత్వం పాకిస్థాన్‌కు చెందినవారిని వాపసు పంపాలని ఆదేశించినా రాష్ట్రంలో అమలు కాలేదన్నారు. అలాగే మంగళూరులో దారుణహత్యకు గురైన హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి తల్లిదండ్రులు గవర్నర్‌కు వినతిపత్రాన్ని అందించారు. సుహాస్ హత్యకు విదేశీ నిధులు వచ్చాయని తెలిపారు. సుహాస్ హత్యకేసును సమగ్రంగా దర్యాప్తు జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. హత్య వెనుక పీఎఫ్ఐ కుట్ర ఉందని తెలిపారు. సుహాస్‌శెట్టి హత్య కేసును ఎన్ఐఏ ద్వారా విచారణ జరిపించాలని కోరారు. ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్, దొడ్డనగౌడ పాటిల్, శాసనసభ్యులు రవికుమార్, అరవింద బెల్లద్, వేదవ్యాస కామత్, గోపీనాథరెడ్డి, ప్రతాప్‌సింహ నాయక, ఎంపీ కెప్టెన్ బ్రిజేశ్‌చౌట పాల్గొన్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ప్రతినిధుల బృందం

మంత్రి జమీర్ ఆధ్వర్యంలో నమాజ్



ప్రార్థనలో పాల్గొన్న మంత్రి జమీర్ అహ్మద్

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరిట సైనికులు నిర్వహిస్తున్న సాహసోపేత సాధనలు విజయవంతం కావాలని మసీదులో మంత్రి జమీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నమాజ్ చేశారు. నగరంలోని శేషాద్రిపురం మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మసీదులలోనూ సైనికులకోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని సూచించామని అందుకు అనుగుణంగానే నమాజ్ చేశారన్నారు.

గెయిల్ 5వేల కోట్ల పెట్టుబడికి ప్రభుత్వ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో మంత్రులతో గెయిల్ సంస్థ ఈడీలు


బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంప్రదాయేతర ఇంధన వనరుల సామర్థ్యం ఒక గిగావాట్ పెంచేలా రాష్ట్రప్రభుత్వంతో గెయిల్ ఒప్పందం చేసుకుంది. ఇందుకుగాను 5వేల కోట్ల రూపాయలు పెట్టుబడులకు ఒప్పందం కుదిరింది. శుక్రవారం భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్, విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్, గెయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు పర్వేశ్‌చుగ్, సుమిత్ కిశోర్ ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. నాణ్యత, సుస్థిర ఇంధనరంగంలో పెట్టుబడులకు కర్ణాటక అనుకూలమైనదని మరోసారి గెయిల్ రుజువు చేసిందని పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అన్నారు. గెయిల్‌కు అవసరమైన మానవవనరులు, భూమితోపాటు ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మంత్రి జార్జ్ మాట్లాడుతూ సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. దేశంలో విద్యుత్ వాడకం పెరుగుతోందన్నారు. నివాసం నుంచి పరిశ్రమలదాకా విద్యుత్ వాడకం తప్పనిసరి అయ్యిందన్నారు. 2035 నాటికి స్కూప్ 1, 2లలో కాలుష్యం వందశాతం తగ్గించేందుకు లక్ష్యం ఉందన్నారు. గెయిల్‌కు సొంతంగా 3,500 మెగావాట్ల మేర విద్యుత్ అవసరం ఉందన్నారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి డాక్టర్ సెల్వకుమార్, కమిషనర్ గుంజన్‌కృష్ణ ఉన్నారు.

జోయాలుక్కాస్‌లో ఎక్స్‌చేంజ్ మేళా

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు కొత్త ఆభరణాల కలను సాకారం చేయాలని జోయాలుక్కాస్‌లో బిగ్ గోల్డ్ ఎక్స్‌చేంజ్ ఆఫర్‌ను ప్రారంభించినట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జోయాలుక్కాస్ ప్రకటించారు. శుక్రవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 9 నుంచి 25వ తేదీ వరకు బహుమానం అనిపించేలా బంగారం కొనుగోళ్లకు ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులు పాతబంగారు ఆభరణాలను మార్పిడి చేసే సమయంలో ప్రతి గ్రాముపై వంద రూపాయలు అదనంగా పొందవచ్చన్నారు. అంటే కొత్త బంగారు ఆభరణాల కోసం షాపింగ్ చేయవచ్చని, ఆభరణాల అభివృద్ధితోపాటు ఆదాను ఆనందించేలా శాశ్వతమైన డిజైన్లలో పెట్టుబడికి ఇదో మంచి అవకాశం అన్నారు. మా వినియోగదారుల కోసం మరింత విలువలు సృష్టించేందుకు కృషి చేస్తామన్నారు. ఆభరణాల కొనుగోళ్లలో అత్యధిక ప్రయోజనాలకు సహాయపడేందుకు గోల్డ్ ఆఫర్‌ను అందిస్తున్నామన్నారు. మీ పాత బంగారు ఆభరణాలు తీసుకొచ్చి కొత్త అందమైన, విలువైన ఆభరణాలు తీసుకెళ్లేందుకు ఇదే అనువైన సమయమన్నారు. ఈనెల 25వరకు అవకాశం ఉంటుందని, సమీపంలోని జోయాలుక్కాస్ షోరూంను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న

హృద్రోగులు



కొవిడ్ బాధితులే ఎక్కువంటున్న వైద్యులు

● దశాబ్దంలో రెట్టింపు ● వ్యాయామలేమి, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యమే కారణాలు

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హృదయ సంబంధిత సమస్యలతో బాధపడేవారి ఆందోళనకరంగా పెరుగుతోంది. ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం, కనీస వ్యాయామం లేకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. గ్యాస్ట్రిక్ వంటి సాధారణ సమస్యలంటూ సొంతవైద్యం చేసుకోవడం, ఏదో ఒక గుళిక వేసుకుని కాలయాపన చేసి ప్రాణాలపై తెచ్చుకునేవారి సంఖ్య పెరుగుతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. దశాబ్దకాలంలో గుండె జబ్బులతో బాధపడేవారి సంఖ్య రెట్టింపు కావడం ఆందోళన కలిగించే సంకేతమని వైద్యనిపుణుల అంటున్నారు.

● ప్రభుత్వ అనుబంధమైన జయదేవ హృద్రోగ విజ్ఞాన పరిశోధనా సంస్థ బెంగళూరు, మైసూరు, కలబురగి శాఖలతోపాటు రాజాజీనగర్‌లోని ఇఎస్ఐ ఆసుపత్రి, కేసీ జనరల్ ఆస్పత్రుల్లో 2024లో ఏకంగా 8.21 లక్షల మంది ఓపీడీ రూపంలో చికిత్సలు పొందడం సర్వత్రా ఆందోళన కలిగించే అంశం. ఇన్‌పేషంట్‌లుగా 76వేలమంది చికిత్సలు పొందగా 5వేల మంది శస్త్రచికిత్సలు పొందారు. బెంగళూరులో ప్రైవేట్ ఆసుపత్రులు వందలసంఖ్యలో ఉన్నాయి. వీటిలో దాదాపు 60 ఆసుపత్రులకుపైగా గుండెజబ్బులకు చికిత్సలు అందిస్తున్నాయి. ఈ ఆసుపత్రుల్లోనూ వేల మందికి శస్త్రచికిత్సలు జరిగినట్టు తెలుస్తోంది.

● 2013లో జయదేవ ఆసుపత్రిలో 3.76 లక్షల మంది అవుట్‌పేషంట్‌లుగా చికిత్సలు పొందారు. 2024 నాటికి రెట్టింపుకంటే ఎక్కువమంది ఓపీడీ సేవలు పొందారు. ఇక ఇన్‌పేషంట్‌లు, ఆపరేషన్ చేయించుకున్నవారి సంఖ్య కూడా రెట్టింపు అయ్యింది.

ఏడాది	అవుట్ పేషెంట్లు	ఇన్ పేషెంట్లు	ఆపరేషన్లు
2013	3.76 లక్షలు	35,000	2,900
2024	8.21 లక్షలు	76,000	5,000

గుండెపోటుకు కారణాలివే....

ఇటీవల కొంతకాలంగా జిమ్ సెంటర్‌లలో వ్యాయామం చేస్తూ కుప్పకూలి మృతి చెందడం, నృత్యం చేస్తూ గుండెపోటుకు గురి కావడం, వాహనాలు నడుపుతూ హృదయసమస్యలతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఒక వ్యక్తి తన శక్తి సామర్థ్యాలను తెలుసుకోకుండానే కఠినమైన వ్యాయామాలు చేయడం ద్వారా హృదయానికి అనుబంధమైన రక్తనాళాల్లో ఒత్తిడి పెరుగుతుంది. రక్తం ఎక్కువగా సరఫరా అయినపుడు ఆక్సిజన్ అందక గుండెపోటుకు కారణమవుతోంది. ఇలా జిమ్‌కు వెళ్లే ముందే శక్తి సామర్థ్యాలను తెలుసుకుని ఎటువంటి వ్యాయామాలు చేయలనేది నిర్ధారించుకోవాలని వైద్యనిపుణులు అంటున్నారు. దీనికి తోడు ఆరోగ్యకరమైన జీవనశైలి, ఒత్తిడి నియంత్రణ కార్యాచరణ పాటించాలి.

జయదేవ ఆసుపత్రిలో చికిత్స పొందిన హృద్రోగుల వివరాలు

ఏడాది	అవుట్ పేషెంట్లు	ఇన్ పేషెంట్లు	ఆపరేషన్లు	బైపాస్ సర్జరీ
2020	39,158	4200	1927	798
2021	5,27,437	5,383	3,485	1,352
2022	6,55,484	68,902	4,586	1,608
2023	7,67,539	74,653	4,733	1,793
2024	8,21,224	76,707	4,922	1,870

యువకులే అధికం

రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో గుండెజబ్బులకు చికిత్సలు పొందినవారిలో యువతే అధికంగా ఉన్నారు. ఐదేళ్లలో యువకులు 20-30శాతం పెరిగారు. ఇందుకు ప్రధాన కారణం జీవనశైలి, కొవిడ్ తర్వాత పరిణామాలు, నిద్రలేమి, పనిలో ఒత్తిడి కూడా కారణం కావచ్చని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. ఇటీవల గుండెజబ్బుతో ఆసుపత్రికి వచ్చే ప్రతివారిని కొవిడ్‌తో ఆసుపత్రిలో చేరారా..? అని ప్రతి హృద్రోగ నిపుణుడు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎక్కువమంది కొవిడ్ బాధితులు ఉన్నట్టు తెలుస్తోందన్నారు. దీనికితోడు ధూమపానం, మద్యపాన వ్యసనపరులు, కనీసం రోజుకు 20-30 నిమిషాలు వ్యాయామం చేయకుండా నిర్లక్ష్యం చేసినవారు గుండె జబ్బులకు గురైనట్టు హృద్రోగ నిపుణుడు డాక్టర్ కేఎస్ కిశోర్ తెలిపారు.



జయదేవ ఆస్పత్రి

మెడికల్ కళాశాలలో కార్డియాలజీ విభాగం తెరవాలి

హృద్రోగుల సంఖ్య పెరగడంతో ఆస్పత్రులపై ఒత్తిడి పెరుగుతోందని, దీంతో ప్రైవేట్ ఆసుపత్రులు చికిత్సల ఫీజులు భారీగా పెంచడంతో జయదేవ ఆసుపత్రికి ఎక్కువమంది బాధితులు వస్తున్నారని డైరెక్టర్ డాక్టర్ కేఎస్ రవీంద్రనాథ్ తెలిపారు. ఆరోగ్య బీమా చికిత్సలు పొందేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువమంది వస్తున్నారన్నారు. జయదేవ ఆసుపత్రి అన్నిశాఖల్లోనూ చికిత్సలకోసం వచ్చేవారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోందన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కర్ణాటక పథకంలో అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలోనూ చికిత్సలు అందే వెసులుబాటు రావాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల్లోనూ ప్రత్యేక హృద్రోగ విభాగాన్ని తెరవాలని, తద్వారా జయదేవ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గనుందన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.55	1,577.69
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,386	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	326	138
నీటి నిల్వ (టీఎంసీలు)	7.69	3.45

క్రమశిక్షణకు మారుపేరు గోఖలే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రవి చెళ్లగుర్కి

బళ్లారి సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారుపేరు గోపాలకృష్ణ గోఖలే అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. సంజీవరాయకోట తాలూకాలోని అరివు సెంట్రల్ లైబ్రరీ సమ్మర్ క్యాంప్‌లో శుక్రవారం నిర్వహించిన గోఖలే 158వ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గోఖలే స్థాపించిన సర్వెంట్ ఆఫ్ ఇండియా సొసైటీ గొప్పగా పనిచేస్తోందన్నారు. ఆయన గాంధీజీ రాజకీయ గురువని, దృఢమైన దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధులు అన్నారు. విద్యార్థులు గోఖలే ఆదర్శాలను స్వీకరించి, విశ్వాసపాత్రంగా జీవించాలని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జ్యోతి, వాణిశ్రీలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సుమతి, గ్రంథాలయ పర్యవేక్షకుడు సిద్దప్ప పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను నెరవేర్చాం'



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నూర్ మహమ్మద్

బళ్లారిరూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని నగరంలోని 15వ వార్డు కార్పొరేటర్ నూర్ మహమ్మద్ అన్నారు. శుక్రవారం వార్డులో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. దాదాపుగా 70 నుండి 80 శాతం వరకు వార్డుల్లో అన్ని రోడ్లను అభివృద్ధి చేశానని తెలిపారు.

తాయమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



గ్రామస్థులతో ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, మే 9(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని భాగవడే గ్రామంలో నూతనంగా నిర్మించిన తాయమ్మదేవి ఆలయనిఖ్ఖ ఎమ్మెల్యే బీఎం నాగరాజు సందర్శించారు. గ్రామప్రజలు, ప్రముఖులు అందరూ కలసి దేవాలయాన్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దారని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రజల పిలుపు మేరకు ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించి నూతన విగ్రహాలు ఏర్పాటుకు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సిరుగుప్ప, మే 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తాలుకాలోని హాళేకోట గ్రామం వద్ద ఆదర్శ విశ్వ విద్యాలయంలో రాజేశ్వరి, శివకిరణ్, కావేరిలను ఏపీఎంసీ అధ్యక్షుడు మంజునాథ, ఉపాధ్యాయులు నారాయణ నాయక్ సన్మానించారు. హాళేకోట, బేలాపురం ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

13 నుంచి మామిడి పండ్ల ప్రదర్శన



ప్రదర్శనకు ఉంచిన మామిడి పండ్లు

కంప్లి, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొప్పళలో 13 నుంచి 22వ తేదీ వరకు 9వ వార్షిక మామిడి పండ్ల విక్రయాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ డిప్యూటీ కృష్ణ తెలిపారు. మామిడి రైతులు తమ పేర్లను స్టాల్స్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9448511649, 8861697989 నంబర్లకు సంప్రదించాలన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా పూజలు

బళ్లారి సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కోసం బీజేపీ బళ్లారి విభాగం కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నూటొక్క కొబ్బరికాయలు పగలగొట్టి పూజలు చేసింది. శుక్రవారం సైనికులకు మద్దతు తెలుపుతూ ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు ఎం.సతీశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు, దివాకర్, కార్పొరేషన్ సభ్యుడు గోవిందరాజులు, శ్రీనివాస్ మోత్కార్, హనుమంతప్ప, సురేఖ, మల్లనగౌడ, కే.రామాంజిని, గడ్డం తిమ్మప్ప, రాణితోట వీరేశ్, ఉజ్వల, రఘు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం వద్ద పోలీసు భద్రత

● మునిరాబాద్ వైపు నుంచి ప్రవేశం బంద్



జలాశయ ప్రవేశ ద్వారం వద్ద పోలీసుల బందోబస్తు

బళ్లారి సిటీ,మే 9(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత వైమానిక దళం పాకిస్థాన్‌పై ప్రతిదాడికి దిగడంతో తుంగభద్ర ఆనకట్ట వద్ద నిఘాను పెంచారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో ఒకటైన తుంగభద్ర ఆనకట్ట భద్రతను నిర్ధారించేందుకు కర్ణాటక పారిశ్రామిక భద్రతాదళాన్ని కొన్ని సంవత్సరాలుగా మోహరించారు. భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుత పరిస్థితుల కారణంగా తుంగభద్ర ఆనకట్ట వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. టీబీ ఆనకట్ట సిబ్బంది, జలవిద్యుత్‌కేంద్ర సిబ్బందితో సహా ఆనకట్టలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆనకట్ట భద్రత కోసం కర్ణాటక పారిశ్రామిక భద్రతా దళం నుంచి డీవైఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఆరుగురు ఏఎస్‌ఐలు, 17మంది హెడ్ కానిస్టేబుళ్లు, 12మంది కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్‌తో సహా మొత్తం 39 మంది సిబ్బందిని నియమించారు. రిజర్వాయర్ పరిసరాల్లో హై అలర్ట్‌ను కొనసాగించారు.

ప్రవేశం పరిమితి: కేంద్రం ఆదేశాల మేరకు తుంగభద్ర ఆనకట్ట వద్ద కఠినమైన భద్రత విధించారు. జలాశయం ఎడమ వైపు నుంచి వీక్షించడానికి ప్రజల ప్రవేశం పరిమితం చేశారు. జనవరుల శాఖ అదనపు కార్యదర్శి ఆదేశాల మేరకు కర్ణాటక పారిశ్రామిక భద్రతా దళం స్థానిక పోలీసులతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. ప్రజల దర్శనం నిలిపివేశారు. సెలవు రోజుల్లో ప్రజలు హొస్పేట ప్రాంతం నుంచి రిజర్వాయర్ వద్దకు రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎడమ వైపు నుంచి ప్రవేశించడం నిషేధించారు.

ఎస్సీలుగా బేడ జంగమను పరిగణనలోకి తీసుకోవద్దు

బళ్లారి సిటీ, మే9(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల జనాభా లెక్కల్లో బేడ జంగమ సమాజాన్ని పరిగణలోకి తీసుకోవద్దని డిమాండ్ చేస్తూ నగరంలోని జిల్లా కార్యాలయ ఆవరణలో ఎస్సీఎస్టీ సంచార తెగల మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ బేడ జంగములు సమాజంలో అగ్రవర్ణాలుగా గుర్తింపు పొందారన్నారు. వారు ఆలయంలో పూజలు చేస్తూ చాలా ఉన్నత స్థానంలో నివసిస్తున్నారని తెలిపారు. ఈసమాజం వీరశైవ జంగం సమాజానికి చెందినదిగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. దళిత కులగణనలో తమ వర్గాన్ని చేర్చాలని జంగమలు చొరవ తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షెడ్యూల్డ్ కులాల జనాభా లెక్కల్లో వీరశైవ జంగములను బేడ జంగములుగా పరిగణించకూడదని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకాలోని వీరశైవ జంగమలు తమను తాము బేడ జంగమ అని పిలుచుకుంటూ అక్రమంగా షెడ్యూల్డ్ కుల ధ్రువీకరణ పత్రాలు పొందారని అన్నారు. వీరశైవ జంగమలు తప్పుడు మార్గాల ద్వారా షెడ్యూల్డ్ కుల ధ్రువీకరణ పత్రాలను పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది షెడ్యూల్డ్ తెగల్లో చేరిన బుడగజంగం వారికి అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థ ఆఫీస్ బేరర్లు గంగాధర్, గూళప్ప, కొండప్ప, నగేశ్‌బాబు, అజ్జప్ప, రామాంజిని పాల్గొన్నారు.



అదనపు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ, ఎస్టీ సంచార తెగలు

భారతదేశానిది గొప్ప చరిత్ర

● రచయిత లింగారెడ్డి ఆలూరు

గంగావతి రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి గొప్ప చరిత్ర ఉందని, ఇక్కడ అనేక రాష్ట్రాలు, సామ్రాజ్యాలు ఉద్భవించి పాలించి రాజకీయ, సాంస్కృతిక గొప్పతనాన్ని నిలబెట్టాయని రచయిత లింగారెడ్డి ఆలూరు అన్నారు. గంగావతి నగరంలోని కేఎస్‌సీ మహిళా కళాశాలలో జాతీయ సేవా పథకం 2024-25 ప్రత్యేక వార్షిక శిబిరంలో చారిత్రక వారసత్వ పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. దేశంలోని అనేక మంది రాజులు, కోటలు, దేవాలయాలు, మసీదులు, బావులు, పుష్కరణిలు, సరస్సులు, వంటి వేలాది స్మారక చిహ్నాలను నిర్మించి చరిత్ర సృష్టించారన్నారు. స్మారక చిహ్నాలరక్షణ ప్రతి ఒక్కరి ప్రాథమిక కర్తవ్యం అన్నారు. గంగావతి తాలూకా, కొప్పల్ జిల్లాలోని వివిధ తాలూకాలో అనేక స్మారక చిహ్నాలు ఉన్నాయని స్థానికులకు అవగాహన లేని కారణంగా అవి శిథిలావస్థకు చేరాయన్నారు. ప్రిన్సిపాల్ శరణబసప్ప మాట్లాడుతూ విద్యార్థులు తమ గ్రామాల్లోని శాసనాలు, శిల్పాలు, దేవాలయాలు, కోటలు, పురాతన నాణేలు గురించి చిన్న వ్యాసాలు రికార్డ్ చేసి రాయాలని సూచించారు. తదుపరి కర్ణాటక ఇతిహాస(చరిత్ర) అకాడమీ సహకారంతో స్మారక చిహ్నాల సంరక్షణపై విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. లెక్చరర్ శారద పాటిల్ చారిత్రక వారసత్వాన్ని కాపాడే కార్యక్రమ స్వభావం, కార్యకలాపాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వాణిశ్రీ పాటిల్, సురేశ్‌గౌడ, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రచయిత లింగారెడ్డి ఆలూరు, అధ్యాపకులు

ధార్మిక కార్యక్రమాలతోనే గ్రామాల్లో ప్రశాంతత

కంప్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ధార్మిక కార్యాక్రమాలతోనే గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని హరిగిణదోణి పంచవని మఠాధీశులు అభినవ సిద్ధలింగ శివాచార్య అన్నారు. తాలుకాలోని మెట్రి గ్రామంలో బన్ని మహంకాళి దేవి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 7 నుంచి 9వ తేదీ వరకు వేదబ్రహ్మ రవిచంద్ర ఆచార్య నేతృత్వంలో వాస్తు పూజ, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం తదితర మతపరమైన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ ధర్మాన్ని అనుసరించి దాని ప్రకారం నడుచుకున్నప్పుడే జీవితంలో ఆనందం లభిస్తుందన్నారు. మానవ మనుగడకు నీరు, ఆహారం, గాలి ఎంత అవసరమో మతాన్ని పాటించడం కూడా అంతే ముఖ్యమన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించాలని, ఈ విషయంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వృషబేంద్రయ్యస్వామి, హెచ్‌ఎం విశ్వేశ్వరయ్యస్వామి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌ను సత్కరించారు. లింగారెడ్డి కుటుంబం, హరిగిణదోణి అభినవ సిద్ధలింగాచార్య, రాజప్ప దంపతులు ఉచిత వివాహాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



అభినవ సిద్ధలింగ శివాచార్యులకు తులాభారం చేస్తున్న భక్తులు

కుడితినిలో తాగునీటికి కటకట..!

కంప్లి, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కుడితిని పట్టణంలో నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. రెండు మూడు రోజుల క్రితమే ఆంజనేయస్వామి రథోత్సవం సంబరాలు జరిగాయి. కానీ సంబరాలకు తగ్గట్టు, పట్టణంలో నీటి సమస్యతో ప్రజల్లో సంతోషం లేకుండా పోయింది. ప్రతి వార్డుకు ఎనిమిది రోజులకొకసారి నీరు వదులుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18వ వార్డు చలవాది కాలనీలో నీటి సమస్య ఏర్పడి ఎన్నో రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చివరకు ఆ వార్డు కౌన్సిలర్ శంకరమ్మ ముందుకొచ్చి శుక్రవారం సాయంత్రం ట్యాంకర్‌తో నీరు అందించారు. కాలనీవాసి గిరీష్ మాట్లాడుతూ 1200 నుంచి 1500 జనాభా ఉన్న వార్డులో కొన్ని రోజుల క్రితమే రెండు బోర్లలో నీరు ఇంకిపోయాయన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నీటి సమస్య తీరలేదన్నారు. రోజులు గడుస్తున్నా పట్టణ పంచాయతీ అధికారి మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నీటి సమస్య పరిష్కరించకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.



18వ వార్డులో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

హోసూరు జోన్

ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయండి

హోసూరు, మే 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల నియంత్రణకోసం కర్ణాటకలో ఏర్పాటు చేసిన రీతిలోనే రాష్ట్రంలోనూ ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని తిరుమళవన్ లిబరేషన్ ఆఫ్ తమిళ ఈలం పార్టీ నాయకుడు థోల్ అభిప్రాయపడ్డారు. నగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నియంత్రణ చట్టం కోసం కర్ణాటక ప్రభుత్వం ప్రతి జిల్లాకొక ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిందన్నారు. తమిళనాడులో కూడా ఇలాంటి విధానం అమలు చేయాలని కోరుతున్నామన్నారు. విద్యారంగంలో పురోగతి సాధించినా సామాజికంగా సాధ్యం కావడంలేదని ఇంకా కొన్ని చోట్ల వివక్ష చోటు చేసుకుంటోందని విచారం వ్యక్తం చేశారు. పుదుక్కోట్టై ఘటనను ప్రస్తావిస్తూ ఈనెల 13న నిరసన ప్రదర్శన చేపడతామన్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వర్షంతో హర్షం

హోసూరు, మే 9(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా ఉంటున్న భానుడి ప్రతాపం నుంచి ఒకింత ఊరట లభించినట్టు పలువురు అభిప్రాయపడ్డారు. గంటకుపై వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా రోడ్లపై వర్షపునీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. వర్షపునీరు సజావుగా ప్రవహించేలా కార్పొరేషన్ తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హనుమంతుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాయచూరు, మే 9(ఆంధ్రజ్యోతి): భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని జిల్లాలోని మాన్వి పట్టణంలో బీజేపీ నాయకులు శుక్రవారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచ పేల్చి విజయోత్సవం జరుపుకున్నారు. నాయకులు స్థానిక ఏపీఎంసీ ఆవరణలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సైన్యానికి మరింత విజయం చేకూరాలని ప్రార్థిస్తు పూజలు నిర్వహించారు.

కుడితిని పంచాయతీ అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం



నూతన అధ్యక్షురాలు సుజాత సత్యప్పను సన్మానిస్తున్న అధికారులు, కౌన్సిలర్లు

కంప్లి, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కుడితిని పట్టణ పంచాయతీ అధ్యక్ష ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. పట్టణ పంచాయతీలో 19 మంది సభ్యులు వుండగా అధ్యక్ష స్థానానికి 12వ వార్డుకు చెందిన సుజాత సత్యప్ప నామినేషన్ వేశారు. 19 మందిలో ఎవరూ పోటీలేనందున సుజాత సత్యప్పనే ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ రేఖ తెలిపారు. గెలుపొందిన సుజాతమ్మకు తోటి కౌన్సిలర్లు, అధికారులు అభినందించారు. సుజాత సత్యప్ప మాట్లాడుతూ తమ నాయకుడు ఎంపీ తుకారామ్, ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ ఇచ్చిన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని, వారి ఆధ్వర్యంలోనే పట్టణంలో అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. తమకు మిగిలివున్న కాలంలో 19 వార్డులలో సమస్యలు తలెత్తకుండా చేస్తామన్నారు. అభివృద్ధికి తోటి కౌన్సిలర్లు సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి తీర్థప్రసాద్ ఉపాధ్యక్షులు కనికేర పంపాపతి, స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్, రెవెన్యూ అధికారి రామకృష్ణ, కౌన్సిలర్లు బీసన్న, చంద్రయ్య దొడ్డబసప్ప, విఠోబా, కౌశిక్, వినోద్, రమేష్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

బళ్లారి సిటీ,మే 9(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంక్లాపూర్‌లో వివిధ కంపెనీల నుంచి 106 లీటర్ల మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రూ.43,985 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు సంక్లాపూర్ తండాకు చెందిన మంజునాయక్‌ను మద్యాన్ని నిల్వ ఉంచాడు. దాడిలో రూరల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గురురాజ్ కత్తిమణి, ఏఎస్‌ఐ రాఘవేంద్ర,మంజునాథ్‌మేటి, పంపాపతి, హాలేశ్, నాగరాజ్ ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయచూరు, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు నగరంలో సోమవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒక నర్సుతో పాటు మరో మహిళ దుర్మరణం చెందారు. శుక్రవారం సింధనూరు తాలూకాలోని కోళబాళ గ్రామానికి చెందిన భాగ్యమ్మ గృహ ప్రవేశంకోసం ఆమె అల్లుడు మహేశ్‌బైక్‌పై తీసుకెళుతుండగా వెనకనుంచి వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి పడిపోయిన భాగ్యమ్మ తలపై లారీ టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది. సంఘటన జరిగిన వెంటనే ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ, సీఐ, టౌన్, రూరల్ ఎస్‌ఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంతో గంగావతి రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాలూకా ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ మహారాష్ట్రకు చెందినదిగా, డ్రైవర్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అలాగే గురువారం రాత్రి సింధనూరులోని ప్రాథమిక ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తున్న నీలమ్మ డ్యూటీ ముగించుకుని ట్రాక్టర్‌పై వెళుతుండగా జారీపడి మృతిచెందింది. నీలమ్మ భర్త బసవరాజ్ ట్రాక్టర్‌పై ఆమెను తీసుకుని వెళుతుండగా వేగంగా వెళుతుండడంతో ట్రాక్టర్ అదుపు తప్పి నీలమ్మ పడిపోయింది. ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెంది. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ హిరేమఠ్ పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదంలో వృద్ధుడు..

గాండ్లపెంట, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీన్లకుంట గ్రామానికి చెందిన వేమన్న (75) ఐజాక్ (కంకర మిషన్) కింద పడి శుక్రవారం మరణించాడు. తన ఇంటికి వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. వేమన్న తన ఇంటికి వెళ్తుండగా.. ఐజాక్ మిషన్ రివర్స్ చేస్తున్న డ్రైవర్ గమనించకపోవడంతో వేమన్న దాని కింద పడి మరణించారు. వేమన్న కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించామని హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయినగర్‌కు చెందిన రాజుపాల్యం గురుశేఖర్‌తో అదే కాలనీలోని నివాసముంటున్న వీరయ్య, మద్దిలేటికి విభేదాలున్నాయి. దీంతో గురువారం రాత్రి వీరిద్దరూ గురుశేఖర్ ఇంట్లోకి దూరి .. అతనిపై, అతని కుటుంబ సభ్యులపై ఇనుపపైపు, కట్టెలతో దాడిచేసి గాయపరిచారు. గురుశేఖర్ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్‌సీఐ రెడ్డప్ప శుక్రవారం తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

కదిరి అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలప్పగారిపల్లి తండాలో శుక్రవారం తనిఖీలు నిర్వహించామని, నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. అతని నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి


నంబులపూలకుంట, మే 9(ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతికుటుంబ రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రేషన్‌కార్డుల కోసం జీవో జారీ చేసిందని, కార్డులో అదనంగా పేర్లు నమోదు, తప్పులు, అడ్రసు మార్పులు చేసుకునే అవకాశముందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓబుళదేవరచెరువు : అర్హులైన వారు రేషన్‌కార్డుకోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అనంతచారి, సీఎస్‌డీటీ విజయనిర్మల కోరారు. మండలంలో ఇంకా 2272 మంది ఈకేవైసీ చేయించుకోలేదన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

యుక్తేశ్వర్ గిరి (జయంతి)




ప్రముఖ ఆధ్యాత్మిక గురువు యుక్తేశ్వర్‌గిరి 1855 మే 10న పశ్చిమబెంగాల్ రాష్ట్రం సీరాంపూర్‌లో జన్మించారు. అసలు పేరు ప్రియానాథ్ కరార్. 'ఒక యోగి ఆత్మకథ' రాసిన పరమహంస యోగానందకు గురువు. లాహిరి మహాశయులు యుక్తేశ్వరకు క్రియాయోగ దీక్షనిచ్చి శిష్యులుగా తీసుకున్నారు. 1894లో కైవల్య దర్శనం' (ది హోలీ సైన్స్) పేరిట పుస్తకాన్ని విడుదల చేశారు. సంస్కృతం, ఆంగ్లం, ఫ్రెంచ్, బెంగాలీ, హిందీ భాషలను ధారాళంగా మాట్లాడేవారు. ఆంగ్ల, సంస్కృత భాషలను సులభంగా నేర్చుకోవడానికి తాను స్వయంగా రూపొందించిన బోధనా పద్ధతులను విద్యార్థులకు వివరించేవారు. భగవద్గీత, ఉపనిషత్తులను, క్రియాయోగాను విస్తృతం చేశారు. 1936 మార్చి 9న మహాసమాధి అయ్యారు.

పంకజ్ మల్లిక్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత పంకజ్ మల్లిక్ 1905 మే 10న కోల్కత్తాలో జన్మించారు. బెంగాలీ సంగీత స్వరకర్త, నేపథ్యగాయకుడు. బెంగాలీ, హిందీ సినీరంగంలో పేరొందారు. సినీ రంగంలో ఆయన చేసిన సేవలకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందారు. ఆలిండియా రేడియోలో కెరీర్‌ను ప్రారంభించి 38ఏళ్ల పాటు బెంగాలీ, హిందీ, ఉర్దూ, తమిళ భాషలలో సినిమాలలో రాణించారు. కేఎల్ సైగల్, ఎస్‌డీ బర్మన్, గీతా దత్, ఆశా భోస్లే వంటి ప్రముఖులతో కలసి పని చేశారు. 'న్యూ థియేటర్స్ కోల్కత్తా'కు 25 ఏళ్ల పాటు పనిచేశారు. 1978 ఫిబ్రవరి 19న కన్నుమూశారు.

ఇబ్రహీం సుతార్ (జయంతి)



కన్నడ కబీర్‌గా పేరొందిన ఇబ్రహీం సుతార్ 1940 మే 10న బాగల్కోటె జిల్లా మహాలింగపూర్‌లో జన్మించారు. 1970లో 'భావైక్య జానపద సంగీత మేళా'ను ఏర్పాటు చేశారు. హిందూ, ముస్లిం యువత కర్ణాటక వారు మాత్రమే కాక పొరుగు రాష్ట్రాలవారు కూడా ఇందులో సభ్యులుగా ఉండి పాటలు పాడేవారు. ఆయన వందలాది పద్యాలు, రచనలు చేశారు. అథణి తాలూకాలోని శేగుణశి గ్రామస్తులతో కలసి 9 కిలోమీటర్ల రహదారి ఏర్పాటు చేశారు. 1995లో రాజ్యోత్సవ పురస్కారం, 2018లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. 2022 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

సునీత (పుట్టినరోజు)



నేపథ్య గాయనిగా రాణించిన సునీత ఉపద్రష్ట 1978 మే 10న గుంటూరులో జన్మించారు. తొలుత టీవీ కార్యక్రమాలకు వ్యాఖ్యతగా, డబ్బింగ్ కళాకారిణిగా, సహాయ దర్శకురాలుగా పలు బాధ్యతలు నిర్వహించారు. 15యేటనే సినీరంగంలో గాయనిగా ప్రవేశించారు. గులాబి, ఎగిరే పావురమా సినిమాలు ఆమెకు ఎంతో పేరు తెచ్చాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలలో 3వేలకుపైగా పాటలు పాడారు. 2020లో 'నీలి నీలి ఆకాశం' పాట ఎంతో పేరొందింది. 750కుపైగా సినిమాలకు 110 మందికిపైగా డబ్బింగ్ చెప్పారు. ఒక ఏడాదిలో 60 సినిమాలకు డబ్బింగ్ చెప్పిన ఖ్యాతి పొందారు. వివిధ కేటగిరీలలో 9 నంది అవార్డులు, 2 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ పురస్కారాలు అందుకున్నారు.

పెండ్యాల హరికృష్ణ (పుట్టినరోజు)



పెండ్యాల హరికృష్ణ 1986 మే 10న గుంటూరు జిల్లాలో జన్మించారు. చదరంగం క్రీడాకారుడు విశ్వనాథన్ తర్వాత దేశంలో ఇతను రెండోస్థానంలో కొనసాగుతున్నారు. 1996లో ప్రపంచ అండర్ 10 ఛాంపియన్‌గా నిలిచారు. 2001లో అతిపిన్న వయస్సులో గ్రాండ్‌మాస్టర్‌గా రికార్డు నెలకొల్పారు. ఈ రికార్డును పరిమార్జిన్ నేగి 2006లో అధిగమించారు. 2004 నవంబర్‌లో ప్రపంచ జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్ సాధించారు. 2016 పీక్ రేటింగ్‌లో 2,768 పాయింట్‌లతో వరల్డ్ టాప్ 10 ప్లేయర్స్ జాబితాలో చేరారు. 2020లో 'చెస్ 960'లో 7 ఆటలకుగాను 5.5పాయింట్స్ సాధించారు. రష్యా ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం సాధించారు. ఫైడ్ గ్రాండ్‌ప్రిక్స్ 2022లో కూడా ఆడారు. 2023 మేలో 2704 పాయింట్‌లతో నిలిచారు.

శేషవాహనంపై ఊరేగిన శ్రీవారు



శేషవాహనంపై స్వామివారు

ధర్మవరం, మే 9(ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం పట్టణ పురవీధుల్లో ఉదయం చెన్నకేశవస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం శేషవాహనంపై, రాత్రి గజవాహనంపై ఊరేగించారు. అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పోరాళ్లపుల్లయ్య శిష్య బృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాశ్, పాల్గొన్నారు. శనివారం ఉదయం మడుగుతేరు, సాయంత్రం 5గంటలకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

● హాజరుకానున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం పట్టణంలో శనివారం ఉదయం నిర్వహించే చెన్నకేశవస్వామి రథోత్సవానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నట్లు టీడీపీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఐఏఎస్ ఉచిత కోచింగ్ సెంటర్

» కళాశాలలో క్యాంటీన్ భవనం, జిమ్‌సెంటర్ ప్రారంభం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజునాథ్

ముళబాగిలు, మే 9(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గ్రామీణ విద్యార్థుల అనుకూలం కోసం కేఏఎస్, ఐఏఎస్, ఐపీఎస్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో జూన్ 15న ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో కళాశాల వార్షికోత్సవ సంబర కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. డిగ్రీ పూర్తిచేసినవారు కేఏఎస్, ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్‌కోసం బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈఅంశాన్ని తీవ్రంగా పరిగణించి తీర్మానించినట్టు తెలిపారు. ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలకు చాలావరకు గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు ఉన్నారని, వారికి రాయితీ ధరలో టిఫిన్, భోజనం సమకూర్చేలా క్యాంటీన్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే రూ.2.5కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మించామని, గ్రంథాలయం సహా అదనపు తరగతి గదులకోసం రూ.4కోట్లు మంజూరు చేశామన్నారు. విద్యార్థులకు తాగునీటి ఇబ్బంది లేకుండా కొత్త బోరుబావి తవ్వించామన్నారు. జిల్లాలో మాదిరి కళాశాలగా తీర్చిదిద్దుతున్నామని చెప్పేందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కళాశాలలో కొరతగా ఉన్న ఇతర మౌలిక సదుపాయాలను త్వరలోన సమకూరుస్తామన్నారు. అందుకు తగ్గట్టుగా విద్యార్థులు కూడా చక్కగా చదివి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులై కేఏఎస్ లేదా ఐఏఎస్ అధికారులుగా సేవలందించాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

బెట్టింగ్‌లకు బలి కావద్దు...

తాలూకాలో ఐపీఎల్ బెట్టింగ్ దందా సాగుతోందని దీన్ని అడ్డుకట్ట వేయడంలో పోలీసుశాఖ విఫలమైందని విచారం వ్యక్తం చేశారు. కాగా బెట్టింగ్ దందాలో యువత బలి కారాదన్నారు. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో మన సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్మీకి మద్దతుగా విద్యార్థులు నినాదాలు చేశారు. తహసీల్దార్ వీ గీతా మాట్లాడుతూ ఇక్కడి ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు గుణాత్మకత విద్య అందిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కేవలం పాస్ కావడమే లక్ష్యం కాకుండా ఉత్తమ జీవనం కోసం చదవాలని పిలుపునిచ్చారు. ఉన్నత లక్ష్యం దిశగా సాగాలన్నారు. పోటీ పరీక్షల్లో సత్తా చాటుకుని ఉన్నత హోదాలు అలంకరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ మునివెంకటప్ప మాట్లాడుతూ కళాశాల సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నాయన్నారు. ఇదే సందర్భంగా క్యాంటీన్ భవనాన్ని, జిమ్ సెంటర్‌ను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. 2024-25లో డాక్టరేట్ పొందిన డాక్టర్ శివరామేగౌడ, డాక్టర్ ఎం ఉమా, డాక్టర్ ఆర్ పవిత్ర, డా బీఎస్ లక్ష్మి, డాక్టర్ వీఆర్ నాగేగౌడ, డాక్టర్ పీఎస్ గంగాధర్, ఆలిండియా బార్ కౌన్సిల్ పరీక్షలో ఉత్తీర్ణులైన కన్నడ అధ్యాపకులు కేఆర్ వెంకటేశ్, ఎస్ మంజునాథస్వామిలను సత్కరించారు. చింతామణికి చెందిన మునిరెడ్డి బృందం ఆలపించిన క్రాంతిగీతాల కార్యక్రమం సభికులను అలరించింది. తాలూకా పంచాయతీ ఈఓ డాక్టర్ కే సర్వేశ్, నగరసభ కమిషనర్ వీ శ్రీధర్, నగరసభ సభ్యుడు ప్రసాద్, రాజణ్ణ, రఘు, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో బోవిగా నమోదు చేయండి



మీడియాతో బోవిసంఘం అధ్యక్షుడు వెంకటరామ్ తదితరులు

బాగేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యా, సామాజిక, ఆర్థిక స్థితిగతులకోసం సర్వే జరుగుతోందని, కేంద్రప్రభుత్వ ఆదేశాలతో చేపట్టే కులగణనలో కులం బోవిగా, ఉపకులం వడ్డరగా నమోదు చేయాలని తాలూకా బోవి సంఘం జిల్లా అధ్యక్షుడు పీడీ వెంకటరామ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ సర్వేలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలన్నారు. తాలూకా అధ్యక్షుడు ఎంవీ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో బోవి సహా వివిధ సామాజికవర్గాలకు జనాభా ఆధారంగా కులవర్గీకరణ చేయనున్నారన్నారు. రిటైర్డు న్యాయమూర్తి హెచ్ఎన్ నాగమోహన్‌దాస్ కమిషన్ సిఫారసు మేరకు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టనుందన్నారు. వివిధ సౌలభ్యాలు పొందేందుకు ఈ సమీక్ష సహకారి కానుందన్నారు. కులగణనతోనే రిజర్వేషన్లు నిర్ధారిస్తారన్నారు. ఊరవ వడ్డరు, మణ్ణొడ్డరు, బండి వడ్డరు, కల్లు వడ్డరు, సుడగాడు వడ్డరు అని స్థానికంగా వివిధ పేర్లతో వ్యవహరిస్తారన్నారు. బోవి సామాజికవర్గానికి చెందినవారినంతా ఒకే రీతిన వ్యవహరించేలా కులం బోవిగా, ఉపకులం వడ్డరగా నమోదు చేయాలన్నారు. మీడియా సమావేశంలో వెంకటేశ్, ఆర్ఆర్ చలపతి, అశోక్, శేఖర్, సురేశ్, శ్రీరామప్ప, చంద్రప్ప, గగన్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా యల్లమ్మదేవి ఆలయ జీర్ణోద్ధరణ

బంగారపేట, మే 9(ఆంధ్రజ్యోతి): ఆలయాల జీర్ణోద్ధరణ, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని హులిబెలె గ్రామంలో రేణుకా యల్లమ్మదేవి ఆలయ జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ఠాపన నిమిత్తం హోమాలు, పూజాకైంకర్యాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు కొనసాగాయి. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ సుమారు ఎనిమిదేళ్లక్రితం ఈ ఆలయానికి భూమిపూజ చేశానని, ప్రస్తుతం గ్రామస్థుల అందరి సహకారంతో సుందరమైన ఆలయాన్ని నిర్మించారన్నారు. ఆలయ నిర్మాణానికి భక్తులంతా సహకరించారన్నారు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి మంచి పంటలు కురవాలని ప్రార్థించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు హెచ్‌కే నారాయణస్వామి, వెంకటాచలపతి, రామేగౌడ, గ్రామపంచాయతీ సభ్యులు ప్రసన్న, రామణ్ణ, సీనప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

సిద్ధలింగయ్య సాహిత్యం చికిత్సలాంటిది



సిద్ధలింగయ్య చిత్రపటానికి పుష్పాంజలి

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యరంగంలో ఎంతోమంది సేవలందించారని అయితే జీఎస్ సిద్ధలింగయ్య ఓ శ్రేష్ఠమైన రచయిత అని కన్నడ అధ్యాపకులు రుద్రేశ్ అదరంగి అభిప్రాయపడ్డారు. సిద్ధలింగయ్య సంస్మరణ సభ జయనగర్‌లోని జేఎస్ఎస్ కళాశాలలో శుక్రవారం జరిగింది. కేవీ నాగరాజమూర్తి సభాధ్యక్షత వహించగా దిబ్బూరు ఎస్ గిరీశ్, విజయ్‌కుమార్, సుధానాగరాజ్ తదితరులు ముఖ్యులుగా పాల్గొన్నారు. రుద్రేశ్ అదరంగి తన ప్రసంగంలో నవోదయం నుంచి విప్లవ సాహిత్యం దాకా కన్నడ భాషలో అనేకమైన ప్రయోగాలను సిద్ధలింగయ్య చేశారన్నారు. ఆయన రచనలు చికిత్సా గుణం లాంటివని కొనియాడారు. కవిగా, అధ్యాపకులుగా, కళాశాల విద్య డైరెక్టర్‌గా సేవలందించారన్నారు. 600మంది అధ్యాపకులను ఎటువంటి గందరగోళం, అవినీతికి తావులేకుండా నియామకాలు జరిపిన ఘనత ఆయనదే అన్నారు. ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులకు సైతం రెగ్యులర్ చేశారన్నారు. ఆయన కన్నడ సాహిత్యరంగానికి మేలిమకుటమన్నారు.

చెట్టుకొమ్మ కూలి బాలుడి మృతి

విజయపుర, మే 9(ఆంధ్రజ్యోతి): విజయపుర పట్టణం నుంచి తాలూకా కేంద్రమైన దేవనహళ్ళివైపు వెళ్లే మార్గంలో అశోక్‌నగర్ క్రాస్ వద్ద మామిడి చెట్టు కొమ్మ కూలిన ఘటనలో ఒక బాలుడు మృతి చెందగా తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. ద్విచక్రవాహనంపై మురళీకృష్ణ, కుమారుడు వరుణ్ (15) వెళ్తుండగా అకస్మాత్తుగా చెట్టుకొమ్మ కూలిపోయింది. శుక్రవారం చోటు చేసుకున్న ఘటనలో కుమారుడు మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. మురళీకృష్ణను స్థానిక సముదాయ కేంద్రంలో ప్రాథమిక చికిత్సకేంద్రం అందించి అనంతరం బెంగళూరుకు తరలించారు.



కూలిన చెట్టు కొమ్మ ఇదే...

గంగాభవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు

చింతామణి, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆదిదేవత నారసింహపేటలో కొలువైన గంగాభవాని 22వ వార్షిక గంగజాతరను పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. పట్టణంలోని నిర్దిష్టమైన వివిధ ప్రాంతాల్లో తృణముద్ద (సల్లముద్ద)ను భక్తులు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ సమితి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉంచిన తృణముద్దలను ట్రాక్టర్‌లో సేకరించి పట్టణ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. గంగజాతరలో భాగంగా అమ్మవారికి తమలపాకులతో అలంకరణ చేశారు.



తమలపాకులతో అమ్మవారికి అలంకరణ, భక్తులు

ద్రౌపదమ్మ ఆలయంలో హసికరగ

ముళబాగిలు, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజ పాళ్యలో కొలువైన ద్రౌపదమ్మ దేవాలయంలో హసికరగ నేపథ్యంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ, పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రంగుల పుష్పాలతో అలంకరించారు. అర్చకులు వెంకటేశ్ నేతృత్వంలో పూజా కైంకర్యాలు సాగాయి. మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు.



అమ్మవారికి విశేష పుష్పాలంకరణ

శ్రీవారికి విశేష పూజలు

శిడ్లఘట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బెళ్ళూటిగేట్ సమీపాన కొత్తగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. ఆలయశుద్ధి అనంతరం 6గంటలకు స్వామివారికి అభిషేకం, అనంతరం తులసి అలంకరణ, పుష్పాలంకరణ చేశారు. ఆలయాన్ని మామిడాకులు, తోరణాలతో ముస్తాబు చేశారు. స్వామి వారికి మహా మంగళారతి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



కల్యాణ వేంకటేశ్వర స్వామి

నగరసభ సభ్యులకు ప్రత్యేక శిబిరం

శిడ్లఘట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరసభ ఆధ్వర్యంలో నగరసభ సభ్యులకు నాయకత్వ లక్షణాలు పెంచడం, పట్టణాభివృద్ధికి నగరసభ సభ్యుల బాధ్యత, కర్తవ్యం అనే అంశాలపై జాగృతి శిబిరాన్ని నగరసభలో నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకుడు మంజునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ, స్థానిక సంస్థలు అమలతో విభిన్న సమస్యలకు పరిష్కారం కోసం స్థానిక సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చెరువులు, బావుల పునరుజ్జీవనం కోసం చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు అనిల్ కుమార్, చిత్ర మనోహర్, ఎస్ఎం మంజునాథ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న నగరసభ సభ్యులు తదితరులు

మార్పు కోసమే మౌలిక సదుపాయాల పెంపు

బెంగళూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మార్పుకోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అందుకే మౌలిక సదుపాయాలు సమకూర్చేదిశగా పనిచేస్తున్నామని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను సమకూర్చేందుకు విద్యాసంస్థల చర్యలు కీలకమన్నారు. జీసీఎస్ సదస్సులో మార్పుకోసం సమైక్యం, విద్య పరిశ్రమలు, సుస్థిర అభివృద్ధికి మార్గం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో డీసీఎం పాల్గొన్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టానని, ఉత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చానని, విద్యాసంస్థల నిర్వహణ నా ప్యాషన్ అన్నారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానంద నాథ స్వామిజీ మాట్లాడుతూ జీసీ సురానా అర్థవంతమైన సాధకుడని కొనియాడారు. కార్యక్రమంలో కర్ణాటక జానపద అకాడమీ-డాక్టర్ మంజమ్మ జోగతి, ఎంజీఐ ఆర్ఐడి - డాక్టర్ కే గాయత్రిరెడ్డి, పర్యావరణం - కమల్‌సాగర్, పెంటగస్ గార్మెంట్స్ - జవహర్ గోవిందరాజ్, మాల్టా యూనివర్సిటీ - డాక్టర్ కర్నాడ్ అటార్డ్, అథర్ ఎనర్జీ - తరుణ్ మెహతా, రిపపర్స్ గ్లోబల్ - ఆదిత్య శిరోయ్‌లకు సురనా పురస్కారాలతో సత్కరించారు. సెయింట్‌జాన్స్ జాతీయ ఆరోగ్య విజ్ఞాన అకాడమీ డైరెక్టర్ ఫాదర్ జేసుదాస్ రాజమాణిక్యం, సురానా ట్రస్టీ డాక్టర్ అర్చనా సురానా, మైక్రో ల్యాబ్స్ సీఎండీ దిలీప్ సురానా పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం




విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఐసీఎస్ఈ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సెయింట్ ఫిలోమినా సంస్థల ముఖ్యులు ప్రత్యేకంగా సత్కరించారు. శుక్రవారం మరియప్పనపాళ్యలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టాపర్లను అభినందించారు. సుజన్ 97శాతం, మనోజ్ 90శాతం, వినుత, అచ్యుత్, యాజినిలు 88శాతం మార్కులు సాధించారు. వారితోపాటు ఉత్తమ మార్కులు సాధించిన 27మంది విద్యార్థులను సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులోనూ రాణించాలని అభిలషించారు. కార్యదర్శి రంగస్వామి తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పఠనాసక్తికి ఆవిష్కరణలు

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడంతోనే కొత్త ఆలోచనలు వస్తాయనేది దశాబ్దాల నానుడి. ప్రముఖ యూత్ ట్రావెల్ హాస్టల్ బ్రాండ్ తన ట్రావెల్‌స్టోరీని ఆసక్తికరంగా అధ్యయనం చేసేందుకు సిద్ధమైంది. కొత్త లిటరరీ ఐపీ గో రీడ్స్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. శనివారం బెంగళూరుతోపాటు గోవాలో కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్టు ప్రముఖ సాహితీ మోనికా మోనాలిసా ప్రకటించారు. పాఠకులు, రచయితల చుట్టూ తమ హాస్టల్ అనుభవాలను పుస్తక ప్రేమికులకు పరిచయం చేసేందుకు కొత్త మార్గం ఇవ్వనుందన్నారు. భాష జీవన అనుభవాలను, రచయితల పుస్తకాలకు సంబంధించి చర్చలు, క్రియేటివిటీ సెషన్లు నిర్వహించనున్నట్టు తెలిపారు. బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్ అదర టెక్నాలజీ హాస్టల్‌లో గోస్టాప్స్‌లో రచయిత, సాహిత్య ఉత్సవం ఫౌండర్ షినా ఆంటోని పలు పుస్తకాలను పరిచయం చేయనున్నారు. పుస్తకాలకు సంబంధించి చర్చాగోష్టులు, వారి అనుభవాలు పంచుకునేందుకు ఇదో వేదిక కానుందని మోనికా తెలిపారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మరథోత్సవం



భక్తుల నడుమ సాగుతున్న రథం

మహదేవపుర, మే 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని హరాడి గ్రామంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి తొలి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ 13వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఉత్సవాలు సాగాయి. ఉత్సవమూర్తికి పుష్పాలంకరణ అనంతరం పురవీధులలో ఊరేగింపు చేశారు. కంసాలె, డొళ్ళుకుణిత, తమటె, మంగళవాయిద్యాల నడుమ కళాబృందాల నృత్యాలతో రథోత్సవం సాగింది. హరాడి, తిగళరపాళ్య, కేఆర్ పుర, మహదేవపుర, వర్తూరు, సిద్దాపుర, వైట్‌ఫీల్డ్, తూబరహళ్ళి, నల్లూరహళ్ళి, వర్తూరుకోడి చుట్టుపక్కల ప్రాంతాలో ప్రజలు రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాసోహం, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. రథోత్సవం, కరగ మహోత్సవానికి రెడ్డి గురుపీఠం అధ్యక్షుడు వేమానానంద స్వామిజీ, ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి తోపాటు స్థానిక ప్రముఖులు హరాడి కృష్ణప్ప, హెచ్‌వీ మంజునాథ్, రామభక్త మంజునాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కడుపు కోత.. తల్లి జ్యోతీబాయి

చిన్నప్పట్నుంచీ ఒకటే లక్ష్యం.. సైన్యంలో చేరాలని. వేరే ఉద్యోగం వద్దన్నాడు. సైనికుడినే అవుతానన్నాడు. ఎంతో కష్టపడ్డాడు. కిలోమీటర్లు పరుగెత్తాడు. ఆఖరుకు అనుకున్నది సాధించాడు. అగ్నివీర్‌కు ఎంపికై, సైన్యంలో చేరాడు. భరతమాత రక్షణ కోసం వీరోచిత పోరాటం చేశాడు. శత్రువులను చెండాడి.. రణభూమిలో వీరమరణం పొందాడు.. గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాను మురళీనాయక్. భారత్-పాక్ యుద్ధంలో మురళీనాయక్ వీరోచిత పోరాటానికి దేశం సెల్యూట్ చేస్తోంది. ఊరూరా నివాళులు అర్పిస్తున్నారు. కొవ్వొత్తుల ర్యాలీలు చేస్తున్నారు.



అగ్నివీరుడై.. శతఘ్ని శూరుడై...

శత్రుమూకలను చెండాడి..
భరతమాత ముద్దుబిడ్డ వీరమరణం
రణభూమిలో జవాను మురళీనాయక్ మృతి
ఊరూరా నివాళులు.. కొవ్వొత్తుల ర్యాలీలు..

హిందూపురం, మే 9(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో దేశ సరిహద్దులో గురువారం రాత్రి జరిగిన భీకర పోరులో గోరంట్ల మండలానికి చెందిన అగ్నివీర్ జవాను మురళీనాయక్ (25) వీరమరణం పొందారు. గోరంట్ల మండలం గడ్డంతండా పరిధిలోని కళ్లితండాకు చెందిన శ్రీరాములునాయక్ జ్యోతీబాయి దంపతుల ఏకైక కుమారుడు మురళీనాయక్. 2000 అక్టోబరు 23న జన్మించారు. చిన్నప్పుడే తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లారు. అమ్మ పుట్టినిల్లయిన సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువు తండాలో అమ్మమ్మ, తాత శాంతిబాయి, నానేనాయక్ వద్ద పెరిగారు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో చదివారు. చిన్నప్పట్నుంచి ఆర్మీలో చేరాలని ధ్యేయం పెట్టుకున్నాడు. 2025 నవంబరులో అగ్నివీర్‌కు ఎంపికై సైన్యంలో చేరారు.

ఊరికొస్తే రోజంతా ఆటలే..

మురళీనాయక్ సెలవు తీసుకుని సొంతూరు కళ్లితండాకు వస్తే స్నేహితులతో కలిసి రోజంతా క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, టెన్నిస్, ఆడేవారు. ఉద్యోగం రాకముందు కళ్లితండా నుంచి పుట్టపర్తి క్రాస్ వరకు సుమారు 20కి.మీ. దూరం రన్నింగ్ చేసేవారు. ఎలాగైనా ఆర్మీలో చేరాలనేదే ధ్యేయం. ఏదైనా శుభకార్యం జరిగితే సెలవుపై వస్తే అందరితో కలుపుకుని ఉల్లాసంగా గడిపేవారు. మూడేళ్ల క్రితం తండాలో వినాయక నిమజ్జనం సందర్భంగా నృత్యం చేస్తూ స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు. తండాలో మురళీనాయక్ ఒక్కరే సైన్యంలో పనిచేస్తున్నారు.


తల్లిదండ్రులతో..

వేరే ఉద్యోగం వద్దని..

డిగ్రీ పూర్తయిన తరువాత మురళీనాయక్‌కు వేరే ఉద్యోగం చేసుకోవాలని తల్లిదండ్రులతోపాటు అవ్వతాతలు చెప్పారు. అవసరమైతే డబ్బు కూడా ఖర్చుచేస్తామని చెప్పారు. అయినా ఆర్మీలోనే పనిచేయాలని వెళ్లారు. స్నేహితులు కూడా వేరే ఉద్యోగం కోసం ప్రయత్నం చేయాలని చెప్పినా వారిమాట కూడా వినలేదు. ఇంకో ఏడాది ఆర్మీలో పనిచేసి స్వగ్రామానికి వస్తానని ఇటీవల స్నేహితులతో చెప్పారు.

విషాదంలో తండా

మురళీనాయక్ వీరమరణం పొందారని తెలియగానే ఒక్కసారిగా కళ్లితండాలో విషాదం అలుముకుంది. తండాలో ఏ ఒక్కరూ పనులకు వెళ్లకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీనాయక్‌ను తలుచుకుంటూ రోజంతా గడిపారు. గురువారం రాత్రి మురళీనాయక్ బుల్లెట్ దెబ్బలతో వీరమరణం పొందారు. శుక్రవారం ఉదయం కమాండర్.. మురళీనాయక్ తల్లి జ్యోతీబాయికి ఫోన్ చేసి, విషయం చెప్పారు. దీంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయారు. చుట్టుపక్కలవారు వెళ్లి ఏం జరిగిందని ఆరాతీయగా.. ఆపరేషన్ సిందూర్‌లో మురళీనాయక్ మృతిచెందినట్లు తెలుసుకున్నారు.

తల్లిదండ్రులు, స్నేహితులతో చివరి మాటలు

గురువారం రాత్రి 7-8గంటల మధ్యలో తల్లిదండ్రులకు మురళీనాయక్ ఫోన్‌చేసి యోగక్షేమాలపై ఆరాతీశారు. తాను క్షేమంగా ఉన్నాననీ, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. స్నేహితుడు వినోద్‌నాయక్‌కు ఫోన్‌చేసి, భీకర యుద్ధం జరుగుతోందనీ, కాల్పులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. ఈ రాత్రి గడిస్తే తనకు పునర్జన్మేనన్నారు. తనకేమైనా జరిగితే అమ్మనాన్నలను బాగా చూసుకోవాలని వినోద్‌కు చెప్పారు. ధైర్యంగా ఉండాలని వినోద్ చెప్పాడు.

జాతరకు వచ్చిన తల్లిదండ్రులు

తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లారు. అక్కడే చిన్న వ్యాపారం చేసుకుంటూ కూలి పనులకు వెళ్తుండేవారు. రెండేళ్ల క్రితం కళ్లితండాలో ఇల్లు కట్టుకున్నారు. మంగళవారం తండాలో జాతర ఉండడంతో శ్రీరాములునాయక్, జ్యోతీబాయి వచ్చి, ఇక్కడే ఉన్నారు.

ఎస్కేయూ గోల్డ్ మెడలిస్ట్

అనంతపురం సెంట్రల్: యద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ ఎస్కేయూ గోల్డ్‌మెడలిస్ట్. ఎస్కేయూ అనుబంధ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ బీకామ్ పూర్తిచేసిన మురళీనాయక్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా బీ సర్టిఫికెట్ పొందారు. చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు, క్రీడల్లో చురుకైన పాత్ర పోషించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సాకే అంజనేయులు పర్యవేక్షణలో క్రీడాశిక్షణ పొందారు. సౌతిండియా యూనివర్సిటీస్ ఇంటర్నల్ టోర్నమెంట్‌లో మురళీనాయక్ అసాధారణ ప్రతిభ చూపారు. చెన్నైలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఎస్కేయూ తరఫున ప్రాతినిధ్యం వహించి, గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. తనవద్ద క్రీడా, ఎన్‌సీసీ శిక్షణ పొందిన మురళీనాయక్, లోకేష్ నాయక్ ఆర్మీకి సెలెక్ట్ అయ్యారని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆంజనేయులు.. 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. మురళీ నాయక్ వీరమరణం పొందటం బాధాకరమని అంజనేయులు ఆవేదన వ్యక్తంచేశారు.


మురళీనాయక్ ఇంటి వద్ద పోలీసులు, స్నేహితులు


పదో తరగతి గ్రూప్ ఫొటోలో మురళీనాయక్ (వృత్తంలో..)


స్నేహితుడి పెళ్లి సందర్భంగా బస్సులో మిత్రులతో కలిసి సెల్ఫీ..

తండాకొస్తే రోజంతా ఆటలే: సాయినాయక్, కళ్లితండా



స్నేహితుడు మురళీనాయక్‌తో 20 ఏళ్ల బంధం. మా తండాకు ఎప్పుడు వచ్చినా రోజంతా ఆటలతోనే గడిపేవాడు. రాత్రయినా తమతోనే ఉండేవారు. మూడు రోజుల క్రితం కూడా ఫోన్‌చేసి మాట్లాడారు. గ్రామంలో మంగళవారం జాతర జరిగింది. అదేరోజు వీడియోకాల్ చేసి మాట్లాడాడు. తాను రాలేకపోయాననీ, సెలవు ఇవ్వలేదనీ, అందరూ ఎంజాయ్ చేయండని చెప్పారు.

కొన్ని గంటల ముందే ఫోన్ చేశాడు: వినోద్‌నాయక్, కళ్లి తండా



మురళీనాయక్, నేను ఒకే రోజు పుట్టాం. అప్పట్నుంచి ఇప్పటి వరకు ప్రాణస్నేహితులుగానే ఉన్నాం. వారంలో నాలుగైదుసార్లు ఫోన్‌లో మాట్లాడతాడు. ఆఖరిగా గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ మాటలు ఇప్పటికీ తలచుకుంటే ఏడుపు వస్తుంది.

మరువలేకపోతున్నాం: వేణుగోపాల్‌నాయక్, కళ్లి తండా



నా స్నేహితుడు మురళీనాయక్ దేశం కోసం ప్రాణాలు విడిచాడని గర్వంగా ఉన్నా.. ఇక మాతో కలిసి తిరగడనే విషయం బాధ కలిగిస్తోంది. జాతరకు వస్తానని చెప్పి రాలేకపోయాడు. అలాంటి స్నేహితుడు దూరం కావడం దురదృష్టకరం.

చదువుకునే రోజుల్లోనే దేశం గురించి మాట్లాడేవాడు..



మురళీనాయక్ విజ్ఞాన్ పాఠశాలలో 1-10వ తరగతి వరకు చదివాడు. చదువుకునే రోజుల్లోనే దేశానికి సేవ చేయాలన్న ఆకాంక్ష ఉండేది. పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా దేశ సేవ గురించి మాట్లాడేవాడు. ఆర్మీలో చేరతానని చెప్పేవాడు. వీరమరణం పొంది భరతమాత ముద్దుబిడ్డ అయ్యాడు. మా పాఠశాల విద్యార్థి అని చెప్పుకోవడానికే గర్వపడుతున్నాం.

-మల్లికార్జున, కరస్పాండెంట్, విజ్ఞాన్ పాఠశాల, సోమందేపల్లి

రాత్రి ట్యూషన్ వదిలితే నా వెంట వచ్చేవాడు..



అవ్వ, తాత ఇంటి వద్ద ఉంటూ మురళీనాయక్ నాగినాయనిచెరువు తండా నుంచి సోమందేపల్లికి పాఠశాలకు వెళ్లేవాడు. రాత్రి ట్యూషన్ వదిలాక కాలినడకన వచ్చేవాడు. చాలాసార్లు నేను బైక్‌పై ఎక్కించుకుని వచ్చేవాడిని. ఈరోజు వీరమరణం పొందాడని తెలిశాక ఇలాంటి సైనికుడిని నా బైక్‌లో ఎక్కించుకుని వెళ్లానా.. అని గర్వంగా ఉంది.

- ఆంజనేయులు, నాగినాయనిచెరువు తండా


పెనుకొండలో మంత్రి సవిత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ


పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నివాళి


శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారుల నివాళి..


హిందూపురంలో కొవ్వొత్తుల ర్యాలీ


నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రత్న

మీ రుణం తీర్చుకుంటా

- మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తాం
- గడువులోగా హంద్రీనీవా పూర్తి చేయాలి
- అభివృద్ధిలో అనంతను మూడో స్థానానికి చేర్చాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఛాయాపురంలో వైడెనింగ్ పనుల పరిశీలన



గుంతకల్లు/ఉరవకొండ, మే9(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఉమ్మడి జిల్లా టీడీపీకి ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని, మీ రుణాన్ని తీర్చుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. హంద్రీనీవా వైడెనింగ్ పనులను పరిశీలించడానికి వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామానికి ముఖ్యమంత్రి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజావేదికను నిర్వహించారు. తొలుత పాకిస్థాన్‌తో యుద్ధంలో అసువులు బాసిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ దేశాన్ని కాపాడగలిగే నేత నరేంద్రమోదీ అని తాను అమరావతి సభలో వ్యాఖ్యానించానని, పాక్‌తో యుద్ధంలో ఆయన సాధిస్తున్న విజయాలు అందుకు నిదర్శనమన్నారు. అభివృద్ధిలో అనంతపురం జిల్లా ప్రస్తుతం 13వ స్థానంలో ఉందని, దాన్ని 3వ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాకు వరాలు..

ప్రజావేదిక సాక్షిగా సీఎం చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లాకు వరాల జల్లు కురిపించారు. ఉరవకొండకు టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేస్తామని, అయితే కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత మంత్రి కేశవ్‌దేనని సీఎం చమత్కరించారు. పొట్టిపాడుకు దగ్గర బ్రిడ్జి నిర్మాణానికి నిధులు, కొట్టాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జీడీపల్లి నిర్వాసితులకు వెంటనే పరిహారం అందిస్తామన్నారు. 50 వేల ఎకరాల మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామన్నారు. జీడీపల్లి, భైరవానితిప్ప, పేరూరు సహా ప్రాజెక్టులన్నింటికీ ప్రాధాన్యం ఇస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి మందలింపు

ప్రజావేదికలో ఛాయాపురం విలేజ్ ఎకనామిక్ ప్రొఫైల్‌ను చదివిన పంచాయతీ కార్యదర్శి రామయ్యను ముఖ్యమంత్రి ప్రశంసిస్తూనే, సమగ్ర పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసినందుకు మందలించారు. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే పని చేపట్టనందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత నిర్లక్ష్యమైతే ఎలా అన్ని ప్రశ్నించారు. ఇకపై ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బంగారు కుటుంబాలను ఆదుకుంటాం

ఎంపికైన బంగారు కుటుంబాలన్నింటినీ అన్నివిధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రజావేదికలో బంగారు కుటుంబాలకు ఎంపికైన వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఛాయాపురంలో బంగారు కుటుంబం కింద ఎంపికైన పార్వతితో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. పార్వతి భర్త బేల్దారి పనులు చేస్తూ కరెంటు షాక్‌కు గురై కిందపడి పనిచేయలేని పరిస్థితికి చేరుకున్నాడు. దీంతో నలుగులు పిల్లలను, భర్తను పోషిస్తున్న పార్వతి తన కష్టాలు సీఎంకు తెలిపింది. తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంది. బంగారు కుటుంబం కింద ఎంపికైనందున ఏదో సాయం చేసి వదిలేసేది లేదని, పిల్లలకు చదువులు, పక్కా ఇల్లు, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి మార్గదర్శిగా ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్త అనంతయ్య మాట్లాడుతూ పార్వతి భర్తకు సెక్యూరిటీ గార్డుగా తాను ఉద్యోగం ఇస్తానని, వారి పిల్లల చదువులకు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మరో మార్గదర్శి రామకృష్ణ గ్రామంలోని 15 కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించడంతో సభలో కరతాళధ్వనులు మిన్నంటాయి.

ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించాలి

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించి, గడువులోపు పూర్తి చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఛాయాపురం గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంత మేరకు పనులు జరిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కాలువలో నుంచే జరుగుతున్న పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు.

రాయలసీమ భాగ్యప్రదాత బాబు: పయ్యావుల

రాయలసీమ భాగ్యప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్ దేశ డ్రిప్ విధానాన్ని 30 ఏళ్ల కిందటే గుర్తించిన దార్శనికుడు చంద్రబాబు అని కొనియాడారు. డ్రిప్ విధానంతో వ్యవసాయంలో ఆ దేశం కొత్త పుంతలు తొక్కిందని గుర్తించి, ప్రత్యేక బృందాలను ఆ దేశానికి పంపి రాష్ట్రంలో డ్రిప్ సేద్యానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో రూ. 800 కోట్లతో మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు చంద్రబాబు అంకురార్పణచేస్తే, జగన్ ఐదేళ్ల పాలనలో డ్రిప్ అనే మాటే వినపడకుండా చేశాడని విమర్శించారు. చంద్రబాబు 2014-19 మధ్య కాలంలో తన ప్రతి పుట్టినరోజుకు ఓ కొత్త ప్రాజెక్టును జిల్లాకు తెచ్చారన్నారు. గొల్లపల్లి రిజర్వాయరు, హెచ్చెల్సీ ఆధునికీకరణ, బీటీపీ, హంద్రీనీవా వైడెనింగ్, కియ పరిశ్రమ తదితర ప్రాజెక్టులు తెచ్చారన్నారు. హంద్రీనీవా వైడెనింగ్‌ను మూడు నెలల్లో పూర్తిచేస్తానన్న జగన్ ఐదేళ్లూ గంప మన్నుకూడా ఎత్తలేదని ఎద్దేవా చేశారు. హంద్రీనీవా కారణంగా సాగుభూముల ధరలు ఐదు రెట్లు పెరిగాయన్నారు. జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు రూ. 72 వేల కోట్లను కేటాయిస్తే, జగన్ రూ.22 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేశారన్నారు. రాయలసీమకు టీడీపీ ప్రభుత్వం రూ. 12,421 కోట్లను ఇస్తే, రాయలసీమ బిడ్డను అని చెప్పుకునే జగన్ రూ. 2,011 కోట్లను కేటాయించి ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, సహాయ కలెక్టరు సచిన్ రహార్, హంద్రీనీవా సీఈ నాగరాజు, ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీబీ చైర్మన్ ఎం కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, నాయకులు ఆలం నరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టేబుల్ బుక్ కాపీ ఆవిష్కరణ

ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా టేబుల్ బుక్ కాపీని ఆవిష్కరించారు. సీఎం మాట్లాడుతూ జిల్లా టేబుల్ బుక్ అద్భుతంగా ఉందని అభివర్ణించారు. దీన్ని తయారు చేయడంలో జిల్లా కలెక్టర్ బాగా కష్టపడ్డారని అభినందించారు. జిల్లా వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, భౌగోళికం, పర్యాటకం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, ఇతర అంశాల కలబోత కాపీ బుక్ అని పేర్కొన్నారు. ఈ బుక్‌ను బెంగళూరుకు చెందిన బంక్‌ల్యాబ్ ప్రతినిధులు 128 పేజీలతో తయారు చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులతో సమాచారం సేకరించి బంక్ ల్యాబ్ ప్రతినిధులు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో మంతులు పయ్యావుల కేశవ్, రామానాయుడు పేర్కొన్నారు.

ఎంపీ 'అంబికా'కు సీఎం పరామర్శ

అనంతపురం అర్బన్: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సీఎం చంద్రబాబు ఫోన్ ద్వారా పరామర్శించారు. ఎంపీసోదరి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించగా, ఆయన బావ గాయపడ్డారు. డెహ్రాడూన్‌కు రెండు చార్టెడ్ ఫ్లైట్స్‌ను శనివారం పంపుతామని, ఒక దానిలో సోదరి మృతదేహం, మరోదానిలో బావను తీసుకొచ్చి హైదరాబాద్‌లో మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఎం సూచించారు. విపత్కర పరిస్థితుల్లో తన కుటుంబానికి అండగా నిలిచిన సీఎం చంద్రబాబుకు ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


హంద్రీనీవా పనులను పరిశీలిస్తున్న సీఎం, మంత్రులు

జిల్లాను టాప్ 3లో నిలపాలి

- భూగర్భ జలాల పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులు, ప్రజాప్రతినిధులకు సీఎం ఆదేశం


ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అనంతపురం మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లోనూ టాప్ 3లో నిలపడానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. ఆమేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వజ్రకరూరు మండలం ఛాయాపురంలో హంద్రీనీవా కాలువ పనుల విస్తరణ, లైనింగ్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రజావేదిక అనంతరం హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో చంద్రబాబు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ముందుగా వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూల మాల వేసి సీఎం శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయంలో డ్రోన్లు

ఇరిగేషన్‌కు సంబంధించి డ్రోన్లను భిన్నమైన టైమ్స్‌లో, డిఫరెంట్ లేయర్స్ పెట్టుకొని ప్రతి రోజు ఎంత పనికి వినియోగించామో చూసుకోవాలన్నారు. మ్యానువల్‌కు, డ్రోన్ వినియోగానికి తేడా ఉందా..? లేదో తెలుసుకోవాలన్నారు. ఐటీ టీం ద్వారా వీటిని ఎలా వినియోగించాలో తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకొని విజన్- 2047కు సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా ఎవరికివారు నియోజకవర్గాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో గుర్తించాలన్నారు. ఆర్థిక పరంగానే కాకుండా మామూలుగా అయ్యే పనులు చాలానే ఉన్నాయని, వాటన్నింటినీ పూర్తి చేస్తే మంచి పేరు వస్తుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు కుటుంబానికి సంబంధించి దత్తత తీసుకోవాలన్నారు. ఆయా లబ్ధిదారులను గుర్తించి దత్తత తీసుకోవాలన్నారు. ఇందుకోసం నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు అధికారులను నియమిస్తున్నామ న్నారు. జిల్లాలో ఉత్తమ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమిస్తామన్నారు. రాష్ట్రంలో 10వేల కిలో మీటర్ల రోడ్ల నిర్మాణానికి రూ.1.5లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పౌల్ట్రీ రంగం తక్కువ ఉందన్నారు. పారిశ్రామిక రంగం, సర్వీస్ సెక్టార్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులకు నీరు ఇస్తే భూగర్భజలాలు పెరుగుతాయని, ఇందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి శ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్రబాబు, జలవనరుల శాఖ సెక్రటరీ సాయిప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణశర్మ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, భూగర్భజల శాఖ, డీఆర్‌డీఏ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.